

# నవభూమి

## నిజామాబాద్

అనుబంధం

28 మే,2025 బుధవారం పేజీలు 4

www.epaper.navabhoomi.in


# జోరుగా మత్తు దందా



**నిజామాబాద్, -నవభూమి:** ఉమ్మడి జిల్లాలో కొంతకాలంగా మత్తు పదార్థాల దందా జోరుగా సాగుతున్నది. తరచూ ఏదో ఒక చోట మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుంటున్న ఘటనలు కోకొల్లలు. ఉమ్మడి జిల్లాకు చెందిన కొంతమంది సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి సరఫరా అవుతున్న అల్ప్రాజోలం కొనుగోలు చేస్తున్నారు. పది రోజుల క్రితం బోధన్‌లో రెండున్నర కిలోల నిషేధిత ఆల్ప్రాజోలం పట్టుకోగా పోలీసులు కీలక ఆధారాలు సంపాదించారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టగా నిషేధిత మత్తు పదార్థం తయారీ కేంద్రం గుట్టురట్టయ్యింది. మహారాష్ట్రలో లైసెన్సుడ్ రసాయన దుకాణంలో అల్ప్రాజోలాన్ని గుట్టుగా తయారుచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వ్యాపారితోపాటు ఆల్ప్రాజోలాన్ని సరఫరా చేసే మధ్యవర్తులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా 30 కిలోల ఆల్ప్రాజోలాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా చరిత్రలో ఇంత భారీ మొత్తంలో పట్టుబడడం రికార్డు అని పోలీసులు చెబుతున్నారు.గతంలోనూ పెద్దమొత్తంలో నిషేధిత మత్తు పదార్థం లభ్యం కాగా మరోసారి సీపీ సాయి చైతన్య నేతృత్వంలోని పరిశోధక బృందం దర్యాప్తులో కీలకవిషయాలను రాబట్టింది. అల్ప్రాజోలం మహారాష్ట్ర నుంచి పల్లెలకు సులువుగా చేరుతోంది. తయారీదారులు, మధ్యవర్తులు, కొనుగోలుదారులు గుట్టుగా ఒక చీకటి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఈ కేసులో వందలాది మంది కొనుగోలుదారులు పోలీసులకు చిక్కే అవకాశం ఉన్నది.మహారాష్ట్ర నుంచి సరఫరా నెలన్నర క్రితం కామారెడ్డి జిల్లాలోనూ అల్ప్రాజోలం పట్టుబడింది. మహారాష్ట్ర సరిహద్దు మద్నూర్‌లో 250 గ్రాముల నిషేధిత పదార్థం పట్టుబడగా.. ఈ కేసులో పోలీసులు కూపీ లాగారు. మత్తు పదార్థం విక్రయిస్తున్న లింకును కనుగొన్నారు. తద్వారా హైదరాబాద్‌లో ఓ వ్యాపారి గుట్టు రట్టయ్యింది. మరింత లోతుగా కేసును పరిశోధించగా మద్నూర్‌లో మరికొంత మంది వెలుగులోకి వచ్చారు. ఈ నెల 15న బోధన్‌లో రెండున్నర కిలోల అల్ప్రాజోలం పట్టుబడగా ఎన్‌డీపీఎస్ యాక్టు 1985 ప్రకారం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పలువురిని కటకటాలకు పంపించారు.వీరితో సత్సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తుల కూపీ లాగితే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో అల్ప్రాజోలం తయారు చేస్తున్న ఓ వ్యాపారి పట్టుబడ్డాడు. ఓ కెమికల్ కంపెనీ పేరుతో అల్ప్రాజోలం ఉత్పత్తి చేసి నిజామాబాద్ జిల్లాకు తరలిస్తున్నాడు. ఇందులో సాలూర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తే అనేక మంది కొనుగోలుచేసినవారు బయటపడే అవకాశం ఉండగా.. ప్రస్తుతానికి కొద్ది మంది మాత్రమే పోలీసులకు చిక్కారు.కొనుగోలుదారులు చిక్కేదెలా? నిషేధిత పదార్థాలను తయారీ చేసి విక్రయించడం ఎంత పెద్ద తప్పో, కొనుగోలు చేయడం కూడా అంతే తప్పు. ఉమ్మడి జిల్లాలో కల్లు తయారీ కాంపౌండ్‌లో లక్షల లీటర్లలో కల్తీ కల్లు తయారవుతున్నది. వందలాది కల్లు డిపోలకు అల్ప్రాజోలం మత్తు పదార్థాన్ని గుట్టుగా 5 గ్రాములు నుంచి 10 గ్రాములు వరకు జేబులో పెట్టుకుని తరలిస్తుండడం గమనార్హం. కల్తీ కల్లును విక్రయించి రూ.లక్షలు దండుకుంటూ సామాన్యుల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు. బోధన్‌లో నమోదైన కేసును లోతుగా దర్యాప్తు చేసి లింకులను ఛేదిస్తే వందలాది మంది కొనుగోలుదారుల ఆచూకీ లభించే అవకాశం ఉన్నది.అప్పుడు కల్తీ కల్లు తయారీకి దాదాపుగా ఫుల్‌స్టాప్ పడే అవకాశాలున్నాయి. సీపీ సాయి చైతన్య గతంలో నార్కొటిక్స్ బ్యూరోలో పని చేసిన అనుభవంతో అక్రమార్కుల గుట్టును రట్టు చేసి రికార్డు స్థాయిలో అల్ప్రాజోలం పట్టుకున్నారు. ఇదే స్ఫూర్తితో కొనుగోలుదారులను సైతం పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కల్లు డిపోల నిర్వాహకులకు కొందరు రాజకీయ పార్టీల నాయకులు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో పోలీసుల ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయమై కాలమే నిర్ణయించాల్సి ఉంది.అక్రమార్కుల ఆట కట్టిస్తాం నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించడం, కొనడం నేరం. డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నం. మాదక ద్రవ్యాల కట్టడికి ప్రజలు సహకరించాలని కోరుతున్నా. గంజాయి,అల్ప్రాజోలం రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు అందిస్తే అక్రమార్కులఆట కట్టిస్తాం.

# అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు



**వినాయక్‌నగర్, -నవభూమి:** మహారాష్ట్ర కేంద్రంగా ఫార్మా కంపెనీ పేరిట అక్రమంగా అల్ప్రాజోలం తయారుచేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు పట్టుకున్నా రు. ముఠాకు సంబంధించిన వివరాలను సీపీ సాయి చైతన్య మంగళవారం కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.బోధన్‌లో ఈ నెల 15, 16వ తేదీల్లో 2.5 కిలోల అల్ప్రాజోలంతో పట్టుబడిన ముఠా సభ్యులపై కేసు నమోదు చేసి రి మాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విచారణలో అల్ప్రాజోలం ముఠా ఆగడాలు వెలుగుచూసినట్లు పేర్కొన్నారు. నార్కోటిక్ డ్రగ్ బృందం ఇంటర్ షిప్ ద్వారా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు తన టీమ్‌తో కలిసి ఈ ముఠా అక్రమ దందాను బహిర్గతం చేసినట్లు వివరించారు.ముఠా సభ్యుల ఆస్తులు సీజ్ మహారాష్ట్రలోని సతారా జిల్లా పరిధిలో ఉన్న సూర్య ప్రభ ఫార్మా కెమికల్ ఇండస్ట్రీలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించి, తమ బృందం అక్కడికి వెళ్లగా విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసినట్లు సీపీ పేర్కొన్నారు. సూర్య ప్రభ ఫార్మా కెమికల్ ఇండస్ట్రీ నిర్వాహకుడు అమర్ సింగ్ దేశ్‌ముఖ్, బయో స్టిములెంట్ కంపెనీ నిర్వాహకుడు బాబూరావ్ బస్వరాజ్ కదేరీ, కాశీ ట్రేడర్స్ ఫార్మా కంపెనీ నిర్వాహకుడు విశ్వనాథ్ కలిసి ముఠాగా ఏర్పడి అల్ప్రాజోలం తయారుచేస్తున్నారని తెలిపారు.వాటిని లక్ష్మణ్‌గౌడ్ అనే మధ్యవర్తి ద్వారా తెలంగాణలోని పలు కల్లుడిపోలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దీంతో నలుగురిని కస్టడీలోకి తీసుకొని విచారించి, మహారాష్ట్రలోని సోలాపూర్‌కు వెళ్లే జాతీయ రహదారి పక్కన బాబూరావ్‌కు సంబంధించిన కంపెనీలో నిల్వ ఉంచిన 30 కేజీల అల్ప్రాజోలం(విలువ రూ.3 కోట్లు)ను సీజ్ చేసినట్లు సీపీ తెలిపారు. అలాగే అమర్ సింగ్ దేశ్‌ముఖ్ ఇంటి నుంచి రూ.12 లక్షల నగదు, రూ.4 కోట్లు విలువ చేసే సూర్యప్రభ ఫార్మా కంపెనీతోపాటు వీరు వినియోగించిన ఫోర్డ్ కారును సైతం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ముఠాను పట్టుకోవడానికి కృషి చేసిన పోలీసు అధికారులకు సీపీ సాయి చైతన్య రివార్డులను అందజేశారు.

# ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్..



2

# రైతుపై విత్తన భారం





2

## నడిచి వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టిన లారీ.. హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి




**వినాయక్ నగర్,-నవభూమి:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. నగరంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన సుంకరి నర్సయ్య (68) అనే వ్యక్తి ఈరోజు ఉదయం దుబ్బ ప్రాంతం నుండి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అటువైపుగా వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. గమనించిన స్థానికలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.కాగా, దవాఖానలో నర్సయ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లుగా నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాలలో ఉంటారని, వారికి సమాచారం అందించినట్లు ఎస్ఐ హరిబాబు పేర్కొన్నారు. డెడ్ బాడీని జిల్లా దవాఖాన మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. కృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించనున్నట్లు హరిబాబు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేశామన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



**రెంజల్.-నవభూమి:** రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సోదరుభావంతో పండుగను జరుపుకోవాలని రెంజల్ తాసిల్దార్ శ్రవణ్ కుమార్, ఎస్ఐ చంద్రమోహన్ మండల ప్రజలకుసూచించారు. మంగళవారం మండలంలోని సాటా పూర్ గ్రామం రైతు వేదిక భవనంలో మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవ వధ చట్టాన్ని పక్కాగా అమలు జరిగాలా అందరు సహకరించాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నిజామాబాద్-నవభూమి:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాధాకృష్ణ విద్యాలయం (ఆర్యసమాజ్) 2007-08 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. 18 ఏండ్ల తర్వాత ఒక్కచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మనం ఈ స్థాయి లో ఇలా ఉన్నామంటే అందుకు తల్లిదండ్రులు, గురువులు కారణమని అన్నారు. మనం ఎంత ఎదిగినా మనల్ని కనిపెంచిన తల్లిదండ్రులను మరవద్దని అన్నారు. చిన్నప్పుడు నేర్చుకున్న క్రమశిక్షణ ను పిల్లలకు నేర్పించాలని, ఫోన్ లకు దూరంగా ఉంచాలని సూచించారు. జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. అంతకుముందు పూర్వ విద్యార్థులు తమను పరిచయం చేసుకొని ఆనాడు చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం గ్రూప్ ఫోటో దిగి తమ గుర్తులను మరింత పదిలపరచుకున్నారు.



## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్..

# బ్లాక్ ఫిల్మ్ వాడకంపై కఠిన చర్యలు


**వినాయక నగర్,-నవభూమి:** నిజామాబాద్ జిల్లా పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు జిల్లా కేంద్రంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో కార్ల పై నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వాడకం పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా కారు డోర్ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న వాటినీ గుర్తించి బ్లాక్ ఫిలిం ను తొలగించి అనంతరం చట్టరీత్యా జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం, ఆర్టిఏ నిబంధనల ప్రకారం కార్ల డోర్ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేయడం నేరం, ఇది ప్రజల భద్రతకు హానికరమని అన్నారు. బ్లాక్ ఫిల్మ్ వలన వాహనాలలో కూర్చున్నవారిని వెలుపల నుండి చూడలేకపోవడం వల్ల అనేక నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.అందువల్ల ప్రజలందరూ ఈ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా బ్లాక్ ఫిల్మ్ వాడితే వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా ట్రాఫిక్ పోలీసులు ప్రజల్లో సురక్షిత డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడానికి ఈ తరహా తనిఖీలు



కొనసాగుతాయని తెలిపారు. జిల్లా ప్రజలకు బ్లాక్ ఫిల్మ్ ను వాహనాల పై వాడకూడదని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను గౌరవిస్తూ, పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆర్ఐ వినోద్, ఆర్ఎస్ఐ సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుపై విత్తన భారం

**మాక్లూర్, -నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై విత్తన భారం మోపి, ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న సర్కార్.. అన్నదాతను అదనుచూసి దెబ్బకొడుతున్నది. ఇప్పటికే పథకాల అమలులో అనేక కొర్రీలు పెడుతున్న ప్రభుత్వం.. జీలుగ విత్తన ధరలు పెంచి మరో పిడుగు వేసింది. ఏకంగా రెండింతలు ధర పెంచేసి రైతులపై మోయలేని భారం మోపింది. రైతులు ఏటా సాగుకు ముందు భూమి సారవంతానికి, పంట దిగుబడి కోసం జీలుగ విత్తనాలను చల్లుకుంటారు.ఏపుగా పెరగగానే కలియదున్ని ఎరువుగా మార్చుకొని నేలను సాగుకు సిద్ధం చేసుకుంటారు. అయితే ఈ ఏడాది విత్తన ధరను భారీగా పెంచేసింది. దీంతో రైతులపై ఆర్థిక భారం పడనున్నది. పంట వేసే సమయం వస్తుందటే చాలు రైతులు జీలుగ విత్తనాల కోసం ఎదురు చేసేవారు. విత్తనాల కోసం బారులు తీరి తీసుకునేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. రైతులు జీలుగ విత్తనాల గురించి ఊసేత్తడం లేదు. ఇందుకు కాంగ్రెస్ ప్రభు త్వం విత్తన ధరలను ఆమాంతం పెంచడమే కారణంగా కనిపిస్తున్నది.బీఆర్ఎస్ హయాంలో రూ.880లకే బస్తా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 కిలోల జీలుగ బస్తా రూ.800 లోపు ఉండేది. ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోయేది. సరాసరిగా రైతుకు ఎకరానికి రూ.300 మాత్రమే ఖర్చయ్యేది. సన్న, చిన్నకారు రైతులు పెద్ద రైతులకు తీసి పోకుండా జీలుగ విత్తనాల కోసం పోటీపడేవారు. విత్తనాల పంపిణీ కేంద్రాల వద్ద రైతుల సందడి కనిపించేది. నేడు సన్న, చిన్న కారు రైతులు జీలుగా విత్తనాలను కొనాలంటేనే జంకుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 కిలోల బస్తాను 2,137.50 రూపాయలకు పెంచేసింది. దీంతో రెండెకరాల్లోపు ఉన్న రైతులు అంతధర పెట్టి కొనుగోలుచేయలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెద్ద రైతులు సైతం కొనుగోలు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్తా ధర రూ.800 లకు లభించేది. దీంతో జీలుగ విత్తనాల కోసం పోటీపడిన అదే రైతులు, నేడు కొనుగోలు చేయడానికి ఆసక్తి





చూపడంలేదు. గత వానకాలం మండలంలో 360 క్వింటాళ్లకు పైగా జీలుగ విత్తనాలు అమ్ముడు పోగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 187 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మాత్రమే కొనుగోలు చేశారు. అంటే సగంమంది మాత్రమే కొన్నారు. మాక్లూర్ పీఏసీఎస్‌లో మాత్రమే విత్తనాలు పూర్తిగా అ మ్ముడు పోగా, అర్మూద్ పీఏసీఎస్, ఆలూర్ మండలం కల్లడి గో దాంలో విత్తనాలు మిగిలాయని అధికారులు చెబుతున్నారు. దీంతో పెరిగిన ధరలకు భయపడికొనుగోలు చేయలేదని స్పష్టమవుతున్నది.రెండు రెట్లు పెంచిన ప్రభుత్వం జీలుగ విత్తనాల 30 కిలోల బస్తాను ప్రభుత్వం రెండురెట్లు పెంచింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 కిలోల బస్తా 800 రూపాయలకు లభించేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బస్తా ధర రూ.2137.50లకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. గతంలో జీలుగ విత్తనాలను ఎన్ని బస్తాలైన కొనేవాళ్లం. ఇప్పుడు ధర చూసి రెండు, మూడు బస్తాలు కన్నా ఎక్కువగా కొనలేకపోయాం. ప్రభుత్వం ధరలను అమాంతం పెంచి రైతుల నడ్డి విరిచింది. జీలుగ విత్తనాలు మిగిలాయంటే రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## ఘనంగా రామలింగ చౌడేశ్వరి మాత కళ్యాణ వేడుకలు

**రుద్రూర్ -నవభూమి:** రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి మాత ఆలయంలో మంగళవారం దేవాంగ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ చౌడేశ్వరి మాత కళ్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. వైశాఖమాసం సందర్భంగా గత నెల రోజుల నుండి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు, ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షులు శ్యామ్ సుందర్ పహాడే, నూత్ పల్లి గణేష్, లోగం నాగరాజు, ఈర్వ శ్రీనివాస్, నూత్ పల్లి బాలరాజు, నూత్ పల్లి వినోద్, లోగం రాజేష్, తొర్తి చందర్,



లోగం సురేష్, దేవాంగ కుల సభ్యులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో ఇందూరు ఫస్ట్



**కంఠేశ్వర్-నవభూమి:** యాసంగి వరి ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగు సన్నద్ధత, ఇందిరమ్మ ఇండ్లు భూభారతి తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే 8.19 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించామని, రాష్ట్రంలో ముందంజలో నిలిచామని చెప్పగా, సీఎం, మంత్రులు అభినందించారు.ఇదే స్ఫూర్తితో మిగిలిన ధాన్యాన్ని సైతం పూర్తిస్థాయిలో సేకరించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు, దళారులు రైతులను నష్టపర్చేలా వ్యవహరిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలంసీజన్‌కు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని సూచించారు.అధికారులతో కలెక్టర్ సమీక్ష..జిల్లాలో ధాన్యం సేకరణపై సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమీక్షించారు. రికార్డు స్థాయిలో 8.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. 700 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టామని, కొనుగోళ్లు పూర్తయినందున 625 కేంద్రాలను మూసివేశామన్నారు. 75 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశలో ఉందని తెలిపారు. 1,00,535 మంది రైతుల ఖాతాల్లో రూ. 1786.13 కోట్ల మేర ధాన్యం డబ్బులు చెల్లించామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ యువ నాయకుడు మృతి: కుటుంబానికి ఆర్థిక సహాయం



**భిక్కనూర్-నవభూమి:** కాంగ్రెస్ పార్టీ ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు అశోక్ క్యాన్సర్ తో పోరాడుతూ బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు తక్షణ సహాయార్థం 25 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. అశోక్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, సీనియర్ నాయకులు కిష్టా గౌడ్, గ్రామ అధ్యక్షుడు నర్సింగ్ రావు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

**భిక్కనూర్-నవభూమి** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ శాలువాతో సన్మానించి మెమోంటో అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులు, తదితరులు ఉన్నారు.



# కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచింది



**రామారెడ్డి-నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులను నట్టేట ముంచిందని బుధవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరధి రెడ్డి మాట్లాడుతూ%ౌ% మండలంలో 17 వేల ఎకరాల్లో వరి రైతులు సాగు చేస్తారని, రసాయన ఎరువు ల వాడకాన్ని తగ్గిస్తూ, రైతులు సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సమయానికి,తగినన్ని పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను సరిపడా చేయక ఇబ్బంది పెడుతుందని అన్నారు. గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై రు 844 కు దాదాపు 1500 బ్యాగుల జిలుగు, 350 బ్యాగుల జనము విత్తనాలను సరపర చేసేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై ముసలి కన్నీరు కాలుస్తూ 200 బ్యాగులు మాత్రమే సరఫరా చేసి, సబ్సిడీని ఎత్తివేసి రూ 2138లకు రైతులకు అందించడం దారుణమని మండిపడ్డారు. వేకువజామునే చెప్పుల లైను పెట్టి 500 మంది రైతులు లైన్లో ఉంటే, 200 మంది రైతులకు మాత్రమే పచ్చి రొట్ట విత్తనాలను అందించటం దారుణమని, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మండలానికి అవసరపడే పచ్చిరొట్ట విత్తనాలను సరైన సమయానికి సరఫరా చేసి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎక్కడికక్కడ ధర్నాలో ర్యాలీలు నిర్వహిస్తామని, అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడగల శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు కొత్తొల గంగారం, గంగావత్ రాజు నాయక్, రాజేందర్, పోతునూరి ప్రసాద్, నాయకులు గడ్డం చిన్న రవీందర్ రెడ్డి, ల్యాగల మహిపాల్, పులి సుధాకర్, కడెం బైరు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్



**కమ్మర్‌పల్లి-నవభూమి:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల వైద్యానికి ఎంతో భరోసానిస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. పడిగెల సంజీవ్ కు రూ.50వేలు, వాల్గోట్ శశివర్ధన్ కు రూ. 17వేలు, కటికే నర్సు బాయికి రూ.20వేల ఆర్థిక సహాయం చెక్కులు మంజూరు అయ్యాయి. అట్టి చెక్కులను లబ్ధివాదుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులు వైద్య ఖర్చులకోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చెక్కులను మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ద్వారా ఎంతోమంది రోగులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆర్థిక సహాయం చెక్కుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రేవతి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు గోపిడి లింగారెడ్డి, కుందేటి శ్రీనివాస్, ఎడ్ల శ్రీకాంత్, బద్దం రవి, మేడమ్ రమేష్, మోదిని శ్రీధర్, మేకల క్రాంతి, పడల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా

# శాంతి కమిటీ సమావేశం

**రెంజల్-నవభూమి:** రాబోవు బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు శాంతియుత వాతావరణం లో పండుగలు జరుపుకోవాలని తహసిల్దార్ శ్రావణ్ కుమార్, రెంజల్ ఎస్సై కే చంద్రమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం రెంజల్ మండలం సాటాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశం లో వారు మాట్లాడారు. కులమతాలకు అతతంగా ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు సాటాపూర్ సంతలో క్రయవిక్రయాలు జరుపుకోవాలని వారు సూచించారు. పాడి ఆవులను, లేగా దూడలను క్రయవిక్రయాలు జరప రాదని వారు పేర్కొన్నారు. నిబంధనలను మించి పశువులను అధిక మొత్తంలో తరలించినట్లయితే కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. రెండు వారాలు పశు వైద్య అధికారులు సంతలో అందుబాటులో ఉండి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని వారన్నారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవటానికి హిందూ ముస్లిం సోదరులు ఐక్యమత్యంతో కలిసి ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రెంజల్ ఎస్సై ఈ చంద్రమోహన్, అసిస్టెంట్ పశు వైద్యాధికారి గంగరాజు, గ్రామ కార్యదర్శులు మహబూబ్ అలీ, రాజేందర్ రావ్, రాఘవేందర్ గౌడ్, సాయిలు, సునీల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : బండి రమేశ్

**కూకట్పల్లి, మే 28, (నవభూమి ప్రతినిధి) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ స్థల, భవన నిర్మాణం కోసం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ని కోరుతూ కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య, కమిటీ సభ్యులతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ప్రెస్ మీట్లు, సమావేశాలు నిర్వహించడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. విలేకరుల ఐక్యత లోపం వల్ల ఇప్పటి వరకు ప్రెస్ క్లబ్ కొరకు ఎవరూ ఆలోచించలేదు అని వ్యాఖ్యానించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ...ప్రజా సమస్యలపై స్పందించే జర్నలిస్టులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తానన్నారు. ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం నా వంతు కృషి



చేస్తాను, అని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి నగేష్, జాయింట్ సెక్రటరీ నాగుల అంజిబాబు, వి. సుజాత, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. లక్ష్మి, కర్ణ కుమార్, అనిల్ కిషోర్, వీర శేఖర్ రెడ్డి, శైలజ, సునీత రాణి పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి పునాది వేశారు

### పిఎసి చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్పల్లి, మే 28, (నవభూమి ప్రతినిధి) :** తారక రామారావు తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి పునాది వేశారని పి.ఎ.సి చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. పద్మశ్రీ నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించుకొని వివేకానంద నగర్ కాలనీ మెయిన్ రోడ్లో ఎన్టీఆర్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు సీట్లు, బట్టర్ మిల్క్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నేని శ్రీనివాసరావు, దేవినేని ప్రసాద్, రామకృష్ణ వెల్ఫేర్ సంఘ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, చంద్రకాంత్, సంజీవరెడ్డి, చంద్రశేఖర్ రావు, శ్రీధర్ రావు, సూర్యనారాయణ, జి.ప్రసాద్, సాంబశివరావు, శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జైహింద్ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్





**కూకట్పల్లి, మే 28, (నవభూమి ప్రతినిధి) :** గురువారం జరగబోయే జైహింద్ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చాడు. బుధవారం మేడ్చల్లోని కెజీఆర్ కన్వెన్షన్ హాల్లో జిల్లాకు చెందిన ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.


### కాళేశ్వరం పుష్కరాలకు భారీ ఆదాయం

కాళేశ్వరం-నవభూమి:కాళేశ్వరంలో 12 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన సరస్వతీ నది పుష్కరాలు గత సోమవారం (మే 26) సాయంత్రం 4 గంటలకు శాస్త్రోక్తంగా ముగిశాయి.న కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

# ఏఎస్ రాజు నగర్లో హంగర్ ఫ్రీ వరల్డ్ చారిటి కార్యక్రమం ప్రారంభం

### ముఖ్య అతిథులుగా హాజరైన సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు

**కూకట్పల్లి, మే 28, (నవభూమి ప్రతినిధి) :** వరల్డ్ హంగర్ డే సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో 'హంగర్ ఫ్రీ వరల్డ్' చారిటి కార్యక్రమాన్ని కూకట్పల్లి ఏఎస్ రాజు నగర్లో ప్రారంభించారు. భారతదేశం, జాంబియాలలో ప్రతిరోజూ 70,000 భోజనాలను పంపిణీ చేయాలనే లక్ష్యంతో మలబార్ యాజమాన్యం ఈ సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు మాట్లాడుతూ తమ ఆదాయంలో 5% స్వచ్ఛంద సేవా కార్యక్రమాల కోసం వినియోగిస్తూ, పేదల కడుపు నింపుతున్న మలబార్ యాజమాన్యం శ్లాఘనీయమన్నారు. ఈ విధమైన సామాజిక బాధ్యత పట్ల వారి నిబద్ధత అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తుకారం, పీ.ఎస్. రాజు, నర్సింహా నాయుడు, మలబార్ బృందం తరపున చెరువుల వినాయక్, మధు, ఫాతిమా, మలబార్ సంస్థ ప్రతినిధులు సహా పలువురు పాల్గొన్నారు.







# మదన్‌లాల్‌కు కన్నీటి వీడ్కోలు

**రఘునాథపాలెం-నవభూమిబ్యూరో:** ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు మదన్‌లాల్‌కు అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో సోమవారం అర్ధరాత్రి మృతిచెందిన విషయం విదితమే. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం ఖమ్మంలోని స్వగృహానికి తరలించగా పలువురు బీఆర్ఎస్ నేతలు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

బుధవారం ఉదయం మదన్‌లాల్ పార్థీవదేహాన్ని డప్పుచప్పుళ్ల నడుమ స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచగా.. వైరా నియోజకవర్గానికి చెందిన నాయకులు, అభిమానులు, బంధువులు, చుట్టుపక్కల గ్రామాలు, తండాల ప్రజలు సందర్శించి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీంతో ఈర్లపూడి గ్రామం జనసంద్రంగా మారింది.

మధ్యాహ్నం అంత్యక్రియల నిమిత్తం పార్థీవదేహాన్ని తరలిస్తుండగా కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌లు మదన్‌లాల్ పాడె మోశారు. ఆ తర్వాత వైకుంఠ రథంపై పార్థీవదేహాన్ని ఉంచి నిర్వహించిన అంతిమయాత్ర గ్రామ శివారు వరకు కొనసాగింది. వైకుంఠ రథం ఎక్కిన వద్దిరాజు, అజయ్ కడవరకూ సాగారు. గ్రామ శివారులోని వైకుంఠధామంలో కుటుంబ సభ్యులు మదన్‌లాల్ అంత్యక్రియలు పూర్తి చేశారు.మదన్‌లాల్ మరణవార్త తెలుసుకున్న అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు కడసారి చూపు కోసం వైరా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయన పార్థీవదేహాన్ని చూసి తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో పలకరిస్తూ మాట్లాడే వ్యక్తి, మంచి గుణం ఉన్న ప్రజానేత మృతిచెందడంతో కన్నీరు పెట్టుకున్నారు. వైరా నియోజకవర్గానికి ఆయన చేసిన సేవా, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.

మదన్‌లాల్ పార్థీవదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్యపాల్గొన్నారు.